# దిష్టి

కాలేజి సంగీతం పోటీలో ఫస్ట్‌ప్రైజ్ వచ్చిన కల్పన బహుమతి కప్పు తీసుకుంటూ వుంటే అభినందనల పరంపర, ఈలలు, చప్పట్లు, గోల మిన్నుముట్టాయి!

అది తీసుకుని మహదానందంగా, స్నేహితురాలు లతతో యింటికి బయలు దేరింది కల్పన. లత యిల్లు కల్పన యింటి మీదుగా వెళితేనే దగ్గర, అందుకే లత తన రిక్షాలో ఎక్కించుకుంది కల్పనని...

కల్పనకు ప్రయిజు వచ్చిన కప్పుని చూస్తూ, "కప్పు చాలా పెద్దదేనే! దీన్ని చూస్తూ వుంటే- నాకు డిబేట్‌లో కూడా యింతకప్పు యివ్వకపోయారా? వెధవలు, అని కడుపు మంటగా వుందే." అన్నది లత నవ్వుతూ...

ఆ వెండికప్పు పెద్దదే... వళ్ళో పెట్టుకుంటే, బరువుగా కూడా వుంది. కల్పన నిట్టూర్చింది... "నీకేం తక్కువే? అన్నీ వున్నాయి. కావాలంటే మనం ఈ కప్పును ఎక్స్‌ఛేంజి చేసుకుందామా?" అంది.

"వద్దులే- అంత మాటన్నావ్. అదే చాలు. మీ అమ్మ, నాన్న చూసి ఎంత మురిసిపోతారో. తీసుకుపో..." అంది.

రిక్షాని జంక్షన్‌లో ఆపేసి దిగిపోయింది కల్పన... లత "ఇంటిదాకా వచ్చి దింపి పోతానబ్బా!" అన్నా కూడా వద్దని వారించి, "ఎంతబ్బా! నాలుగడుగులే కదా! నేవెళతాలే-" అంటూ వెళ్ళిపోవటం కల్పన కలవాటే!

నిజానికి కల్పనకి అలా చేయడం యిష్టం లేదు. తన ఫ్రెండ్ తన యింటికి రావాలనీ, ఫ్రెండ్స్ యిళ్లకు తను వెళ్లాలని వుంటుంది కానీ, ఇంటిదగ్గర పరిస్థితులు అలాంటివికావు. ఒక్కొక్కసారి ఆశ్చర్యపోతూ వుంటుంది "ఈ బి.ఎ. ఫైనలియర్ దాకా నేనెట్లాగ వచ్చానురా భగవంతుడా," అని. తండ్రి కామేశం యింట్లో వున్నాడేమో, చూడలేని దృశ్యాలేమైనా ఎదురౌతాయేమోనని బెదురుతూనే గుమ్మంలో అడుగుపెట్టింది కల్పన.

మరొకరైతే, అంత పెద్ద బహుమతి వచ్చినందుకు రెక్కలు కట్టుకొని, బోలెడు ఉత్సాహంగా, యింటికి వచ్చి - అమ్మ వొళ్లోనో, నాన్న చేతుల్లోనో దాన్ని పెట్టి... ముద్దులు కురిసేవారు- కాని కల్పనను

చూస్తూనే- ఏడుస్తున్న తమ్ముడూ, చెల్లి- పదేళ్ల రాంబాబు, ఎనిమిదేళ్ళ సరళ వచ్చి, ఆమె కాళ్లకు చుట్టకున్నారు.

తండ్రి కామేశం, తల్లి శారదమ్మా ఘర్షణ పడుతున్నారు. కామేశం కొంచెం చదువుకున్నావాడే- చేస్తున్న ఉద్యోగం కూడా గుమస్తాలాంటి వుద్యోగమేకాని... దుర్వ్యసనాల పుట్ట. సాయంకాలమైందా.. అతను అల్లగాజనంతో కలిసిపోతాడు. త్రాగడం, పేకాడటం, ఈ రెంటిలో ఏది లేకపోయినా, అతడు నీళ్లలోంచి బైటకి తీసిపారేసిన చేపలాగా గిలగిల్లాడిపోతాడు. ఒకోసారి కూలీ నాలీ చేసుకుంటూ - బ్రతికేవాళ్లపాటి సంస్కారం కూడా ఉండదు. కల్పన కిదేమీ కొత్తకాదు. రాంబాబుని, సరళని బుజ్జగించింది.

"చూడమ్మా! చూడుబాబూ! నాకెంత బహుమతి వచ్చిందో... యిదో వెండికప్పు.. దీన్ని అక్కడ బల్లమీద పెట్టండి" అంది కల్పన.

కామేశం శారదమ్మను, అంత క్రితమే జుట్టుపట్టుకుని, మెడలు వంచి, వీపుమీద గుద్దినట్లున్నాడు- ఆమె కూలబడి నీళ్లు నిండిన కళ్లతో భర్తని విషపు పురుగుని చూసినట్లు చూస్తున్నది. "దీని సిగదరగా... దీన్నేనాడు కట్టుకున్నానో- ఆనాటినుంచి నాకు దరిద్రం పట్టుకుంది. ఛీ... ఛీ.. ముష్టిముండా కొంప. ఎప్పుడు చూసినా "తేరా! తే! గాడిదకొడకా!" అంటారే తప్ప ఒక్కనాడు యింటికి వచ్చేసరికి మనశ్శాంతి కలిగేలా అఘోరించి ఏడవరు... వెధవమూక-"

కామేశం యింకా తాగి రాలేదన్న మాట! మాట తడబడటం లేదు... భాష ఇంకా కొంచెం వినడానికి వీలుగా వుంది.

ఛీ... ఛీ... పెళ్లీడు వచ్చిన కూతురుంది. ఇంకా మొహానికి సిగ్గులేదు... పెళ్ళాన్ని కొడతారు. పైగా నేనేం ఉద్యోగం చేస్తున్నానా? లేకపోతే - అత్తవారు, అమ్మగారూ వదిలిపోయిన లంకెబిందెలు వున్నాయా? నన్ను పీక్కుతినకపోతే వెధవ తాగుడూ, జూదం మానేయరాదూ... శారదమ్మ గొంతేమీ చిన్నది కాదు.

"అబ్బ! మహా పతివ్రత చెప్పిందికదా అని మానేస్తారే! పగలంతా నీకోసం, నీ సంతానం కోసం చాకిరీ చేసేది చాలక సాయంకాలం అలా క్లబ్బుకి పోయొస్తే... నీ అబ్బసొమ్ములల్లే పోయినట్లు గోలెడతావ్, పైగా గుఱ్ఱమంతైంది ఆడపిల్ల... యిదే మొగాడైతే ఈ పాటికి చేతికందేవాడు. దాన్నేమో కాలేజీకి తోల్తావ్,- ఏం? ఎందుకూ? ఏదైనా దుకాణంలో సేల్స్ గరల్‌గా పారేస్తే ఒక వెయ్యి తెచ్చిపోసేదిగా నీ చేతిలో-"

నాన్నా! యింక మీరు 'అమ్మా' దయచేసి కొట్టుకోకండి. నేను పరీక్షలు రాయడాన్కి యింకా నెల్లాళ్లే టైముంది. అంతే...ఆ తర్వాత, నా పొట్టతిప్పలు నేనే పడతాన్లే.. ప్లీజ్! నువ్వు అమ్మని చావచంపక బయటికిపో... అవిడకసలే గుండెదడకూడా వుంది-" కల్పన కోపంగా కసిరింది. "ఆహా హ! గుండె నొప్పట! అయితే ఓ అయిదు రూపాయలిలా పారేయమను.. రాత్రికి పాతిక చేసుకొస్తాను..."

"ఛీ ... ఛీ! కన్నకూతురితోనా మీరిట్లా..." అంటూ శారదమ్మ అడ్డురాగా, కామేశం- 'ఛూ' అంటూ చీదరించుకున్నాడు.

ఆఫ్టరాల్ ఫైవ్ రూపీస్‌కి మొహం వాచాడీ కామేశం... లాభంలేదు. నాకు క్లబ్బులో పరువుదక్కదీవాళ... సరే, ఏదో ఒకటిలా పారేయ్," అంటూ అరిచాడు.

అంతలో కల్పనకి బహుమతి వచ్చిన కప్పు చూసాడు. వెంటనే మెత్తబడి పోయాడు "అమ్మా! కల్పా! ఏంటే యిది? వెండి పూత కాబోలు! ఔనా మనదేనా? ఎవరైనా ఎరువిచ్చారా?" అన్నాడు వెండి కప్పుని చేతిలోకి తీసుకుని... కల్పనకి గ్రుడ్లలోకి నీళ్ళు చిప్పిలి వచ్చాయి. కాని, లోపల లోపలే దు:ఖం అదుముకుని - "అది నాకివాళ కాలేజీలో యిచ్చిన బహుమతి అమ్మా!" అంది తల్లివైపు తిరిగి.

"మామ్మే! నాతల్లే! నా అందాల బొమ్మే!" అంటూ శారదమ్మ లేచి, బిడ్డ దగ్గిరగా వచ్చి తల నిమిరింది. కామేశం ఎంతో ప్రసన్నుడైనాడు...

"భలే బాగుందమ్మా! వస్తా... ఇప్పుడే మా ఫ్రెండ్సుకి చూపెట్టి"- అంటూ కప్పును చంకన బెట్టుకుని రివ్వున బయటికి వెళ్ళిపోయాడు, కల్పన వారించే ప్రయత్నం కూడా చేయలేనంత త్వరగా. ఆ అమ్మాయికి వేలాది హర్షధ్వానాల మధ్య లభించిన 'అమూల్య' కానుకను మూల్యంగా మార్చడాన్ని పట్టుకుపోయాడు కన్నతండ్రి!

ప్చ్! పోనీ. కర్మ... అది తాకట్టుపెట్టి తాగేస్తాడు. యీ పూట నాన్న. పోన్లే అలాగేనా తండ్రికి ఈ బిడ్డ కాస్తంత ఆనందం యివ్వగలిగాననుకుంటుంది..." అంటూ దు:ఖం పట్టలేక తల్లి వొళ్లో తలదూర్చి బావురుమని ఏడ్చేసింది కల్పన.

శారదమ్మ ఏమంటుంది?

అంతా మన ఖర్మతల్లీ! యీ పాడు బుద్ధులు రోజు రోజుకీ ఎక్కువై పోతున్నాయి. యీయనకి... మన సరళ పుట్టక మునుపు ఆఖరికి సిగరెట్ కూడా ముట్టి ఎరగరమ్మా, అంటూ భర్త అవలక్షణాలను కూతురు దగ్గరే దాచాలని యత్నం చేసింది.

'తెస్తారులే తల్లీ! కప్పు ఆయనేం చేసుకుంటారు? నా బంగారు తల్లికివాళ ఎంత దిష్టి తగిలిందో... లే... ఓసారి ఉప్పు దిగదుడిచి పారేస్తా"-నంది శారదమ్మ.

కల్పన వెలితిగా నవ్వింది.

"ఎందుకమ్మా.. వుండనీ... వుప్పుకూడా దండగెందుకు? పిల్లలికి మజ్జిగలో వేసి యిద్దువుగాని... నాలాంటి మొద్దుకి రాగవిరాగేలే వుండవు... యింక దిష్టికూడానా?" అంది తన కుమార్తెకి లభించి అమూల్యమైన బహుమతిని మూల్యంగా మార్చుకునే తండ్రి కామేశం ఫోటో- అతని చిన్ననాటి దొకటి గోడకు వేలాడుతూ వుంటే దాన్ని చూసి కల్పన నోటి చివరిదాకా వచ్చిన తిట్లన్నీ అతికష్టం మీద ఆపుకుని బరువుగా నిట్టూర్చింది.

"నాకు దేవుడిచ్చిన కమ్మని నాకంఠం అనే బహుమతి మాత్రం లాక్కోవులే నాన్నా!" అనుకున్నది భారంగా! ఆ కమ్మని వరానికి కామేశం దిష్టి తగలగలదా?

**(1980 యువ దీపావళి సంచిక)**